

## మెడిసిన్ చదవాలనుకున్నా చదరంగం వైపు అడుగులు పడ్డాయిలా..!

ఫిడే మహిళల వరల్డ్ కప్ ఛాంపియన్‌గా అవతరించిన దివ్య దేశ్‌ముఖ్ పేరు ప్రస్తుతం దేశమంతా మార్మోగిపోతోంది. 19 ఏళ్లకే భారత గ్రాండ్‌మాస్టర్‌గా రికార్డు సృష్టించిన దివ్య.. టీనేజ్ నుంచే సంచలన విజయాలకే కేరాఫ్. చిన్న వయసు నుంచే చదరంగంలో అబ్బురపరుస్తున్న తను ఇప్పుడు ఏకంగా వరల్డ్ ఛాంపిన్‌గా యావత్ దేశం గర్వపడేలా చేసింది. మనదేశం నుంచి 88వ గ్రాండ్‌మాస్టర్ ట్యాగ్ సొంతం చేసుకుంది. అందంతోనే కాదు.. ఆటతోనూ అందర్నీ ఫిదా చేస్తున్న ఈ యంగ్ బ్యూటీ విశేషాలివి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ దివ్య సొంతూరు. ఆమె తల్లిదండ్రులు జితేంద్ర దేశ్‌ముఖ్,నమ్రతా దేశ్‌ముఖ్ ఇద్దరూ డాక్టర్లే. దాంతో.. పెద్దయ్యాక తను కూడా వైద్యురాలిగా స్థిరపడాలనకుంది దివ్య. అయితే.. తానొకటి తలిస్తే విధి మరొకటి తలచినట్టు అనుకోకుండా చదరంగం వైపు ఆమె అడుగులు పడ్డాయి. భవాన్స్ భగవాన్‌దాస్ పురోహిత్ విద్యా మందిర్‌లో దివ్య జీవితంలో టర్నింగ్ పాయింట్. అక్కడే ఆమె చెస్ మీద ఆసక్తి పెంచుకుంది.


నిజామాబాద్
మంగళవారం
29.07.2025

సంపుటి : 15 సంచిక: 317
పేజీలు: 7 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్


# చట్టం


సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక




## నేడు కామారెడ్డి జిల్లాకు

### మంత్రులు సీతక్క, పొంగులేటి రాక

చట్టం ప్రతినిధి కామారెడ్డి : కామారెడ్డి జిల్లాలో ఇద్దరు మంత్రుల పర్యటన ఖరారైంది. జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఐమంగళవారం నిర్వహించే నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు.ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు మంత్రుల పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లాలో ఇప్పటికే 2.60 లక్షల పాత రేషన్ కార్డులు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం జిల్లాకు 15,302 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయగా 48,971 కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చారు. దోమకొండ మండలానికి చెందిన 352 కొత్త రేషన్ కార్డులు, 1,841 మెంబర్ యాడింగ్ కార్డులు, బీబీపేట మండలానికి చెందిన 555 కొత్త రేషన్ కార్డులు, 1,547 wమెంబర్ యాడింగ్ కార్డులను లబ్ధిదారులకు మంత్రులు పంపిణీ చేయనున్నారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం ఫంక్షన్ హాల్లో పంపిణీ కార్యక్రమం చేపట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రభుత్వ హామీలన్నీ నెరవేరుస్తున్నాం, రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ



▶ షబ్బీర్ అలీ

**చట్టం నిజామాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు జోడెడ్ల మాదిరిగా పరుగులు పెడుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. నిజామాబాద్ పట్టణంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలు మరియు మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను పెంచడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తోందని అన్నారు. ఆహార భద్రతలో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్ అని పేర్కొంటూ, రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలలో 93 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు అందించడంతో పాటు, ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల సన్న బియ్యం ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం భారతదేశ చరిత్రలో ఒక రికార్డుగా నిలిచిందని ఆయన వెల్లడించారు. నిజామాబాద్ పట్టణంలో ఒకే రోజు 3174 కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయడం సంతోషకరమైన అంశమని ఆయన అన్నారు. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న కొత్తగా వివాహమైన జంటలు మరియు ఇతర కుటుంబాలకు ఈ కార్యక్రమం ఊరటనిస్తుందని షబ్బీర్ అలీ వివరించారు. గత ప్రభుత్వాలు రేషన్ కార్డుల జారీని నిర్లక్ష్యం చేసినప్పటికీ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రక్రియను వేగవంతం చేసిందని ఆయన స్పష్టం చేశారు.

**బీసీ డిక్లరేషన్ అమలు, ఇతర హామీలపై వివరణ**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉందని, గవర్నర్ ఆర్డినెన్స్ కోసం ఇప్పటికే పంపించామని షబ్బీర్ అలీ తెలిపారు. 22% రిజర్వేషన్‌ను 42%కు పెంచామని, బీసీ రిజర్వేషన్ ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆరు పథకాల హామీలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ ఇల్లు లేని వారికి ఇంద్రమ్మ ఇళ్లు పథకం కింద నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా ద్వారా రాష్ట్రంలో 51 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద 93 లక్షల కుటుంబాలకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం అందుబాటులో ఉందని వివరించారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతు రుణమాఫీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రూ.21,000 కోట్లతో రెండు లక్షల రూపాయల వరకు రైతుల రుణాలను మాఫీ చేశామని షబ్బీర్ అలీ వెల్లడించారు. రేషన్ కార్డుల జారీలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నామని కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ పారదర్శకంగా గ్రామ సభల ద్వారా అర్హులను గుర్తిస్తూ నిర్వహిస్తున్నామని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. అర్హత గల ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని ఈ దిశగా చేపట్టిన కార్యక్రమాలు దేశంలోనే ఒక మైలురాయిగా నిలుస్తాయని షబ్బీర్ అలీ పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సౌత్, నార్త్ తహసీల్దార్లు బాలరాజు, విజయ్ కాంత్, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టండి



- **హాస్టల్స్ ను కేటాయించిన ప్రతి అధికారి తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలి**
- **హాస్టల్స్ లో ఆహారం, తాగునీరు, పరిశుభ్రతను పాటించేలా చర్యలు తీసుకోవాలి**
- **హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**చట్టం, హనుమకొండ ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలనుండి వచ్చిన అర్జీలను పెండింగ్ లో లేకుండా వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులు, పలువురు తహసీల్దార్లతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు తమ అర్జీలను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ ప్రజలు 283 వినతులను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ ఆయా శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రజావాణి అర్జీల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, హాస్టల్స్ తనిఖీ, పర్యవేక్షణ, తీసుకోవాల్సిన చర్యల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు ఇటీవలి వరకూ హాస్టల్స్ తనిఖీ చేసినప్పుడు అక్కడ గుర్తించిన అంశాలు, సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా జిల్లా అధికారులు పర్యవేక్షణకు తమకు కేటాయించిన హాస్టల్స్ కు తనిఖీ కి వెళ్ళినప్పుడు బేసిక్ చెక్ లిస్టు ప్రకారం వసతులు ఉన్నాయా లేదా అనేది జిల్లా అధికారులు తనిఖీ చేయాలన్నారు. ఇప్పటి వరకూ తనిఖీ చేయగా ఆయా హాస్టల్స్ లో ఏయే అంశాలను, సమస్యలను గుర్తించారని వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలువురు తహసీల్దార్లతో కలెక్టర్ మాట్లాడారు. హాస్టల్స్ లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, తాజా కూరగాయలు వండే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి హాస్టల్ నుండి చెత్త తరలింపు జరగాలన్నారు. తప్పనిసరిగా డ్రై డే (శుక్రవారం)కార్యకలాపాలు అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వాటిని సరిచేయాలని అన్నారు. గతేడాది ఇబ్బందులు ఏర్పడిన ప్రాంతాలను సందర్శించాలని సూచించారు. హాస్టల్స్ లో ఫుడ్, వాటర్ సప్లై బాగుందా లేదా అనేది తప్పనిసరిగా అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల పరిధిలోని గ్రామాలలో వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి ని పరిశీలించి ఇండ్ల నిర్మాణాలు త్వరగా చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వినతులను సమర్పించేందుకు ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అందుకు తగిన ఏర్పాట్లను చేశారు. ప్రజావాణి దరఖాస్తు సమర్పించిన వారికి రిసిప్ట్ ను ఆలస్యం లేకుండా అందించేందుకు అదనపు సిబ్బందిని నియమించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సాఫీగా వినతులను సమర్పించే విధంగా సిబ్బందిని కేటాయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, డిఆర్డిఓ మేన శ్రీను, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, జిల్లా అధికారులు, పలువురు తహసిల్దార్లు పాల్గొన్నారు.



## నిద్రమత్తులో ఆర్ అండ్ బి అధికారులు


చట్టం న్యూస్ జహీరాబాద్: పట్టణంలోని జహీరాబాద్ నుండి తాండూరు వెళ్లే ప్రధాన రహదారి ప్రస్తుతం గుంతలతో నిండిపోవడంతో ప్రజలు చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో రోజూ ప్రయాణించే వాహనదారులు నడుము నొప్పులతో పాటు ఇతర అనారోగ్య సమస్యలకు లోనవుతున్నట్టు వాపోతున్నారు. ఈ రహదారి పరిస్థితి దారుణంగా ఉంది. వర్షా కాలం రాగానే ప్రతి కొన్ని అడుగులకు ఒక గుంత కనిపిస్తోంది. వాహనాల్లో ప్రయాణించగానే దేహం నెత్తిన పడుతుంది, అని ఓ స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశారు. జహీరాబాద్ నుండి తాండూరు వరకు వెళ్తున్న వాహనాలన్నీ గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన బాగారెడ్డి పైఓవర్ బ్రిడ్జ్ మీదుగా వాహనాలు, మార్గ ప్రయాణం వెళ్తున్నాయి. అయితే ఈ రోడ్డు గుంతలతో నిండిపోవడం వల్ల ప్రజలు ప్రయాణించేందుకు భయపడుతున్నట్లు పేర్కొంటు న్నారు. ప్రజలు అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఈ రహదారి మీదే రోజూ వందలదిమంది ప్రయాణిస్తున్నారు. అయినా ఇప్పటి వరకు సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు ఏ చర్యలు తీసుకోలేదు. కావున తక్షణమే రహదారి మర మ్మత్తులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.



# పోదాంపదా.. నాగమ్మ జాతర

- నేడే గాడిచర్లపల్లిలో నాగుల పంచమి నాగమ్మ జాతర
- నాగమ్మ దర్శనం కోసం భారీగా తరలిరానున్న భక్తజనం
- అమ్మవారిని దర్శించుకోనున్న పలువురు ప్రముఖులు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన కోటిపడగల సంతాన నాగదేవత ఆలయం





**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** భక్తుల కొంగు బంగారం...కోరి కొలిచిన వారికి కోటి వరాలు కురిపించే కల్పవల్లి.... కోటి పడగల సంతాన నాగదేవత. సిద్దిపేట పట్టణంలోని గాడి చర్లపల్లిలో కొలువుదీరిన ప్రత్యక్ష దైవం. శ్రావణ మాసం నాగుల పంచమి పర్వదినం సందర్భంగ ఆలయ వ్యవస్థాపకులు కంకణాల (ఇటుక )దశరథం స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాగమ్మ జాతర లో నాగదేవత ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనుంది..

కోటి పడగల సంతాన నాగదేవత కు ప్రతి ఏటా శ్రావణ మాసం నాగుల పంచమి సందర్భంగ నాగమ్మ జాతర' సు ఘనంగా నిర్వహించడం అనవాయతీగా వస్తుంది. ఆలయ వ్యవస్థాపకులు కంకణాల దశరథం స్వామి ఆధ్వర్యంలో నాగమ్మ జాతర కోసం ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.. ఈ జాతరకు సిద్దిపేట జిల్లాతో పాటు హైదరాబాద్ , సిరిసిల్ల, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, అదిలాబాద్ జిల్లాల నుంచి అలాగే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి నాగదేవత దర్శనం కోసం భక్తులు వేలాదిగా తరలిరానున్నారు.ఈ నేపథ్యంలో కోటీ పడగల సంతాన నాగ దేవత ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పెద్ద సంఖ్యలో జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

**ప్రత్యేక పూజలు**

నాగుల పంచమి నాగమ్మ జాతర సందర్భంగ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తెల్లవారుజామున అమ్మవారికి బోనాల సమర్పన, పాలాభిషేకం, కుంకుమార్చన, అఖండ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయంలో కొలువై ఉన్న నాగలోక రక్షకుడు ఐన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు , పూజలు నిర్వహిస్తారు.

**ఆధ్యాత్మికతకు నిలయం**

కోటి పడగల సంతాన నాగదేవత ఆలయం ఆధ్యాత్మికతకు, భక్తి భావానికి నిలయం. సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆలయంలో నాగ దేవత విగ్రహం ఏకశిలా రూపంలో ఉండటం ఇక్కడి ప్రత్యేకత. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, పాలరాతి శివ లింగం, పంచముఖ ఆంజనేయస్వామి, నవగ్రహ దేవాలయాలు ఇక్కడ ప్రసిద్ధి.

**ఆలయ చరిత్ర**

40 సంవత్సరాల క్రితం సిద్దిపేట పట్టణంలోని నాసర్ పురకు చెందిన కంకణాల (ఇటుక ) దశరథం పట్టణ శివారులోని గాడిచర్లపల్లి గ్రామం వద్ద ఇటుక వ్యాపారం చేస్తూ ఉండేవారు. తాను పనిచేసే చోట వేప చెట్టు ఉండేది. అదే చెట్టు మొదట్లో ఒక పాము పుట్ట ఉండేది. అలసిపోయినప్పుడల్లా సేదతీరేందుకు ఆ చెట్టు కిందకు వెళ్లేవాడు దశరథం. తాను నిద్ర పోయినప్పుడు ఓ పాము వచ్చి అతని తలవద్ద పడగవిప్పి ఆడేది. దీనిని గమనించిన అక్కడి పనివాళ్ళు పలుమార్లు దశరథంకు ఈ విషయం చెప్పారు. ఆ తరువాత కొద్ది రోజులకు ఇటుక బట్టీల వద్ద ఆయన ఎటువైపు వెళ్లిన పాము ఆయన వెంట వచ్చేది. ఒకరోజు కలలో నాగదేవత కనిపించి ఇటుక వ్యాపారం చేస్తున్న చోట వేపచెట్టు కింద ఉన్న పుట్ట ఉన్నప్రాంతంలో ఆలయం నిర్మించాల్సిందిగా కోరింది. ఐతే తను చాలా కాలంగా సంతానం కోసం ఎదురుచూస్తున్నాని, తనకు సంతానం కలిగితే సంతాన నాగదేవత పేరుతో ఆలయాన్ని నిర్మిస్తానని దశరథం చెప్పాడు. కొద్ది కాలంలోనే దశరథంకు కూతురు పుట్టడంతో నాగతులసి అని పేరు పెట్టుకుని ఆ వెంటనే నాగదేవత ఆదేశించినట్టుగానే కోటి పడగల సంతాన నాగదేవత పేరుతో ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించాడు.. తన వ్యాపారాన్ని వదిలిపెట్టి పూర్తిగా ఆధ్యాత్మికత వైపు మరలిపోయాడు. కొద్ది రోజుల తర్వాత ఆయనకు తీవ్ర అనారోగ్యం ఏర్పడింది. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో ఆసుపత్రిలో చేరిన కంకణాల దశరథం బ్రతకడం కష్టం ఇంటికి తీసుకు వెళ్ళమని వైద్యులు కుటుంబ సభ్యులకు చెప్పారు. చేసేది ఏమీ లేక ఆయనను ఇంటికి తీసుకువచ్చారు .అప్పటికే ఆయన పూర్తిగా స్పృహ కోల్పోయి విషమ పరిస్థితుల్లో ఉన్నాడు .ఆ సమయంలో ఆయన కొన్ని గంటలపాటు చలనమే లేకుండా ఉండిపోయాడు. ఆ తర్వాత నిద్రలో నుంచి లేచినట్లుగా లేచి కూర్చుని తనకు ఏమైంది బంధువులందరూ ఎందుకు వచ్చారు, అని అడగడంతో అందరూ ఆశ్చర్యపోయారు. కొన్ని గంటలపాటు తాను దైవ సన్నిధిలో ఉన్నానని నాగదేవత తనకు దర్శన మిచ్చి తనను తిరిగి ఆరోగ్యాన్ని ప్రసాదించిందని చెప్పారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉండడంతోపాటు ఆలయాన్ని దినదిన ప్రవర్తమానంగా అభివృద్ధి చేస్తూ వస్తున్నారు. కోటి పడగల సంతాన నాగ దేవతను దర్శించుకున్న భక్తుల కోరిన కోర్కెలు తీరడంతో నిత్యం వందల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వస్తున్నారు. సంతానం కోసం అమ్మవారికి ముడుపులు కట్టిన భక్తులందరికీ సంతాన భాగ్యం కలగడంతో ఈ ఆలయం కోటి పడగల సంతాన నాగదేవత ఆలయంగా ఎంతో ప్రసిద్ధి పొందింది. సిద్దిపేట పట్టణంలోని కోటి పడగల సంతాన నాగదేవత భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతూ కోరిన కోరికలు తీరుస్తూ భక్తులకు సుఖ సంతోషాలను అందిస్తోంది. ఆలయ ఆవరణ అంతా నక్షత్ర వృక్షాలతో ఉండటం వల్ల ఇక్కడికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం, మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

## పత్తి,పెసర మరియు సోయాబీన్ పంటల పరిశీలన వ్యవసాయ అధికారి



**చట్టం జుక్కల్ :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం మహమ్మదాబాద్ గ్రామంలో సోమవారం నాడు క్షేత్రస్థాయిలో సాగు అవుతున్న పత్తి,పెసర మరియు సోయాబీన్ పంటలను వ్యవసాయ విస్తరణ అధికారి సతీష్ చిద్రవార్ పరిశీలించి రైతులకు తగు సలహాలు,సూచనలు ఇవ్వడం జరిగింది. ప్రత్తి పంటలో ప్రధానంగా రసం పీల్చే పురుగులు అయిన పెనుబంక, పచ్చ పురుగు, తెల్లదోమ ఉధృతిని గమనించడం జరిగింది. దీని నివారణకు డిఫెంథియురాన్ +అసటమిప్రిడ్ (Hercules) 250gm లు ఎకరాకు లేదా ఫ్లునోకమిడ్ (ఉలాల ) 5060gm లు ఎకరాకు 200లీటరు ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించడం జరిగింది. ఎక్కడయినా వర్షపు నీరు పంట చేనులో నుంచొని ఉంటే చిన్న కాలువలు తీసి బయటకు వదలాలి అని సూచించడం జరిగింది. వర్షపు నీరు అలాగే ఉంటే మొక్కకు parawilt వచ్చి మొక్క చనిపోయే అవకాశం వుంటది. పర విల్ట్ నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ (COC) 400గ్రాములు ఎకరాకు +19.19.19@1kg ఎకరాకు కలిపి పిచికారీ చేయాలని సూచించడం జరిగింది. అదేవిధంగా పెసర పంటలో పొటాషియం లోపం, రసం పీల్చే పురుగులు మరియు పచ్చ పురుగు ఉధృతిని గమనించి నివారణకు అసిటమిప్రిడ్ 50గ్రాములు ఎకరాకు +13.0.45@1kg ఎకరాకు + Mancozeb +Carbendizum (Saaf) ఎకరాకు 400గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించడం జరిగింది. సోయాబీన్ పంట పూత దశలో ఉంది. సోయాబీన్ పంటలో ముఖ్యంగా పచ్చ పురుగు, Stem girdle beetle గమనించడం జరిగింది.వీటి నివారకు Emamectin benzoate(EM1)100గ్రాములు ఎకరాకు లేదా Novaluron 100ml ఎకరాకు లేదా Flubendimide (Takumi) 100గ్రాములు ఎకరాకు దానితో పాటు 19.19.19@1kg ఎకరాకు కలిపి పిచికారీ చేయాలని సూచించడం జరిగింది. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పురుగు మందులు పిచికారీ చేయాలని తెల్పడం జరిగింది.ఈ పంటల సందర్శనలో రైతు సోదరులు పాకాలి విట్టల్ , హన్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేశంపేట మండల కేంద్రంలో రూ.25 లక్షలతో విద్యుత్ మరమ్మతులు ప్రారంభం



**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:** కేశంపేట మండల కేంద్రంలో విద్యుత్ సౌకర్యాలను మెరుగుపర్చేందుకు రూ.25 లక్షల వ్యయంతో విద్యుత్ మరమ్మతుల పనులు ప్రారంభమయ్యాయి. గత అయిదు దశాబ్దాలుగా వాడుతున్న పాత విద్యుత్ లైన్లు శిథిలావస్థకు చేరడం వల్ల తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండగా, గ్రామస్థుల విజ్ఞప్తిపై షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించారు.గ్రామ మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి గ్రామ ప్రజలతో కలిసి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే, ఎమ్మెల్యే వెంటనే సానుకూలంగా స్పందించి నూతన విద్యుత్ స్తంభాలు, వైర్లు ఏర్పాటు కోసం అవసరమైన రూ.25 లక్షల నిధులను మంజూరు చేయించారు. గ్రామ విస్తరణకు అనుగుణంగా కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటుకు కూడా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే శంకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడ వీరేశం, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, స్థానిక ఎమ్మార్వో, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పేరుకే చౌదర్‌గూడా మండలం... అన్ని అద్దె భవనలే!




**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:** చౌదర్‌గూడా మండలం ఏర్పడి చాలా కాలం అవుతున్నా, అభివృద్ధి మాత్రం ఇప్పటికీ ఆమడ దూరంలోనే ఉంది. ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగించే మండల స్థాయిలో అత్యవసరమైన ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతుండటం స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలిగిస్తోంది. పోలీస్ స్టేషన్,ఉమ్మడి గ్రామ పంచాయతీలోనే మహిళా సమైక్య , ఎమ్మార్వో కార్యాలయ సేవలు నిర్వహిస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే మరెన్నో సమస్యల వలయంల తయారైందని,ఒక్కటైనా సొంత భవనంలో లేకపోవడం బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గిరిజన యువనేత ఆకాష్ నాయక్ తీవ్రంగా స్పందిస్తూ... చౌదర్‌గూడా మండలాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసినా, అభివృద్ధి మాత్రం మరిచిపోయారు. ఏ ప్రభుత్వ కార్యాలయానికీ శాశ్వత భవనం లేదు. అద్దె భవనాల్లోనే ప్రజా సేవలు కొనసాగుతుండటం దురదృష్టకరం. ప్రజల అవసరాలను తీరుస్తున్న అధికారులకు సరైన వసతులు లేవు. సమస్యల వలయంలో మునిగిపోయిన చౌదర్‌గూడా మండలాన్ని గమనించాల్సిన అవసరం ఉందన్నారు.మండలాన్ని ఏర్పాటు చేయడమే కాదు, అందుకు అవసరమైన నిధులు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందనే వాదనలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వం ఈ సమస్యలపై వెంటనే స్పందించకపోతే ప్రజా ఆందోళనలు తప్పవని, మరింత నిర్లక్ష్యం కొనసాగితే ప్రభుత్వాలకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన చింతల వెంకటరామిరెడ్డి

**చట్టం, శివ్వంపేట :** ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరి అయిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధ్యత కుటుంబ సభ్యులకు మెదక్ జిల్లా శివ్వంపేట పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా సోమవారం నాడు అందజేయడం జరిగింది. మండల పరిధిలోని శభాష్ పల్లి గ్రామానికి చెందిన గుండె నాగమ్మకు 60 వేల రూపాయలు, మర్కంటి మల్లమ్మకు 47 వేల రూపాయలు ఆసుపత్రి ఖర్చు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ నిరు పేద కుటుంబాలకు వరంగా ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమ కోసం కృషి చేస్తుందని ఆయన అన్నారు. అదేవిధంగా శభాష్ పల్లి గ్రామానికి చెందిన షేక్ జాన్ మియా భార్య ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో బాధిత కుటుంబానికి వెంకటరామిరెడ్డి ఐదువేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అయ్యగారి యాదగిరి, నర్సింలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి



**చట్టం, భైంసా :** రోడ్డు ప్రమాదంలో భాగంగా ముధోల్ ఆశ్రమ పాఠశాల పి ఈ టి ఆడే నరేష్ (45) ఉపాధ్యుడు మృతి చెందిన ఘటన సోమవరం విషాదంగా మారింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా కుబీర్ మండలం సిరిపెల్లి తండాకు చెందిన ఉపాధ్యాయులు ఆడి నరేష్ ముధో నియోజకవర్గ కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇది నిర్వహణలో భాగంగా ఈ క్రమంలోని తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కాలం కాటు వేసి నిజాంబాద్ వైపు నుంచి బైంసా కు వస్తున్న బస్సు భైంసా నిజాంబాద్ ప్రధాన రహదారిపై సేవాలాల్ సమీపంలో చౌక్ వద్ద బైక్ ను ఢీ కొట్టిన బస్సు దీంతో పాలైన నరేష్ నువ్వు వెంటనే 108 అంబులెన్స్ లో తరలించగా అప్పటికి అయినా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో బంధువులకు సమాచారం అందించగా ముధోల్ పట్టణ పోలీసు బృందం ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతి చెందిన ఉపాధ్యాయుడు నరేష్ స్థానిక పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థిని విద్యార్థులు మరణ వార్త విని జీర్ణించి కోలేరు దీనితో వారి కుటుంబ సభ్యులు సాహ ఉపాధ్యాయులు తదిరు తదితరులు కన్నీరు మున్నీరు అయి శోకసముద్రంలో మునిగారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## రాజరాజేశ్వర ఆలయంలో కాంగ్రెస్ నాయకుల కుటుంబ సమేత దర్శనం




**చట్టం, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల పేట గ్రామంలో ఉన్న పవిత్ర శైవక్షేత్రం రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం రోజున కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు. గ్రామస్తుల ఆహ్వానానికి స్పందనగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రాం రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, సొసైటీ మాజీ చైర్మన్ బోండ్ల సాయిలు, తిమ్మారెడ్డి గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ సుఖేందర్ రెడ్డి తదితరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సన్నిధిని చేరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలను అందుకొని, భక్తులతో కలిసి స్నేహపూర్వక వాతావరణంలో అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా మండల ప్రజలు సుఖసంతోషాలు, సంపదలతో నిండిన జీవితం, పాడిపంటలతో సంపన్నత కోసం వారు పరమ శివుడిని ప్రార్థించారు. ఈ భక్తిపూరిత కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఘంటసాయిలు, గ్రామ ప్రముఖులు గణపతి తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తుల ఆతిథ్యానికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత సాన్నిహిత్యం, విశ్వాసం కలిగేలా ఈ పర్యటన ఆదర్శంగా నిలిచింది. భక్తి, సేవా భావం, సామాజిక సమరసతతో కూడిన ఈ సందర్శన వృద్ధి, అభివృద్ధికి మార్గం చూపించనుంది.

## నల్లజేరు జ్యోతికి అండగా ఉంటాం



**చట్టం న్యూస్ బీర్కూర్ :** కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో నల్లజేరు జ్యోతి అనే ఎస్సీ కులానికి చెందిన అమ్మాయిని అదే గ్రామానికి చెందిన నర్రా సాయిలు అని బీసీ కులానికి చెందిన వ్యక్తి గత 16 సంవత్సరాల నుంచి ఆమెకు మాయమాటలు చెప్పి లో బర్చుకొని సంసారం చేసి రెండో పెళ్లి చేసుకొని 8 సంవత్సరాల బాలుడు ఉన్నాడు. గత 12 సంవత్సరాలుగా బాన్సువాడలో ఇద్దరు కలిసి నివాసం ఉంటూ ఇప్పుడు చిన్న చిన్న గొడవలు పెట్టుకొని అనుమనిస్తూ నువ్వు తక్కువ కులం దానివి అని చెప్పి ఎలాగైనా వదిలేయలి అని ప్లాన్ చేసి రోజు గొడవలు సృష్టించి కొట్టి తన పుట్టింటికి పంపించడం జరిగింది. ఆ అమ్మాయి ఆ 8 ఏళ్ళ బాబుతో ఎం పని చేసి పోషించాలి ఉండడానికి ఇల్లు లేదు వ్యవసాయ చేసుకోవడానికి గుంట భూమి ఇవ్వ లేదు అని తనకు తగిన న్యాయం చేయాలని రోడ్డుమీద వచ్చి ధర్నా చేస్తున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సునిల్ రథోడ్ ఆ కుటుంబాన్ని పరామర్శించి అసలు విషయం తెలుసుకుని రాష్ట్ర sc st చైర్మన్ దృష్టికి అలాగే జిల్లా కలెక్టర్ దృష్టికి బాన్సువాడ డిఎస్పి దృష్టికి తీసుకువెళ్లి ఆ అమ్మాయి జ్యోతికి తగిన న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామని అన్నారు.

## ఎల్లారెడ్డిలో ఫిట్నెస్ జిమ్ సెంటర్ ప్రారంభించిన డీఎస్పీ శ్రీనివాసరావు



**చట్టం, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో సోమవారం కొత్తగా ఏర్పాటైన ఫిట్‌నెస్ జిమ్ సెంటర్ ను డీఎస్పీ శ్రీనివాస్ రావు ఘనంగా ప్రారంభించారు. ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెరుగుతున్న ఈ రోజుల్లో, ఈ జిమ్ యువతకు దోహదపడుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బొజ్జ మహేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, మాజీ మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ గాయాజుద్దీన్, ఇతర స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నేతలు మాట్లాడుతూ ఈ తరహా ఫిట్‌నెస్ సెంటర్లు యువతలో ఆరోగ్యపరమైన శ్రద్ధను పెంపొందిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి మౌలిక సదుపాయాలు మరింత అవసరం అని పేర్కొన్నారు. అత్యాధునిక సాధనాలతో అందుబాటులోకి వచ్చిన ఈ జిమ్ ద్వారా ఎల్లారెడ్డి పట్టణ యువత ఆరోగ్యంపై దృష్టి సారించే అవకాశాన్ని పొందనుంది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువత, ప్రజలు హాజరై ఉత్సాహం వ్యక్తం చేశారు.

## టీఎన్జీవోస్ సమస్యల పరిష్కారానికి షబ్బీర్ అలీ తక్షణ స్పందన



**చట్టం నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా విచ్చేసిన ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీని టీఎన్జీవోస్ పక్షాన ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్ అండ్ బీ వసతిగృహం నందు జరిగిన ఈ భేటీలో టీఎన్జీవో నాయకులు షబ్బీర్ అలీని శాలువాతో సత్కరించి, ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఉద్యోగుల సమస్యలను సావధానంగా విన్న షబ్బీర్ అలీ, తక్షణమే సానుకూలంగా స్పందించి, ఉన్నతాధికారులకు ఫోన్ చేసి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల సమస్యలపై ఆయన చూపిన ఈ తక్షణ స్పందనకు టీఎన్జీవో పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి టి. దినేష్ బాబు, సంయుక్త కార్యదర్శి జాఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## కవయిత్రి ఎడ్ల లక్ష్మికి సన్మానం



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** మహారాష్ట్ర ప్రభుత్వం ప్రథమ భాష తెలుగులో ఒకటో తరగతి గాను అచ్చుల పాట సిద్దిపేట జిల్లాకు చెందిన ఎడ్ల లక్ష్మీ రాసిన గేయం ప్రచురితం కావడం పట్ల సిద్దిపేట కవులు హర్షం వ్యక్తం చేస్తూ, స్థానిక మహాత్మా గాంధీ పార్క్ సిద్దిపేటలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయస్థాయిలో బాలసాహిత్యంలో సిద్దిపేట ఖ్యాతిని లక్ష్మి నిలిపినందుకు అభినందించారు. కార్యక్రమంలో కవులు ఐత చంద్రయ్య, ఎన్నవెల్లి రాజమౌళి, ఉండ్రాళ్ళ రాజేశం, వరుకోలు లక్ష్మయ్య , బస్వ రాజ్ కుమార్ , కాల్వ రాజయ్య, పిడపర్తి అనిత గిరి, మల్లంల కనకయ్య, ఎడ్ల భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో పలు ఫర్టిలైజర్లను సందర్శించిన సంబధిత అధికారులు




చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక
28 Jul 2025 | Visit for more news Chattamnewstv.com | Page 1
Source: epaper.chattamnewstv.com

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఫర్టిలైజర్ షాపులు

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఫర్టిలైజర్ షాపులు
- ఫర్టిలైజర్ షాపులపై అధికారుల నిఘా కరువు
- అధిక ధరలతో ఫెర్టిలైజర్ విక్రయాలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని వ్యవసాయ అధికారులు

**చట్టం న్యూస్ జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని పుట్టగొడుగుల్లా వేలుస్తున్న ఫర్టిలైజర్ షాపులు అనే దానిపై చట్టం న్యూస్ దినపత్రికలో వార్త కథనం ప్రచురితం కావడంతో వ్యవసాయ అగ్రికల్చర్ శాఖ అధికారులు వెంటనే స్పందించారు. సోమవారం స్పందించి జహీరాబాద్ వ్యవసాయ అధికారి ఏఓ లావణ్య ,మరియు అధికారులు సిబ్బంది మన గ్రోమోర్, అదేవిధంగా వీరభద్ర ఫర్టిలైజరు దుకాణాలను సందర్శించిన క్షేత్రం స్థాయిలో దుకాణంలో ఉన్న స్టాక్ లను,మరియు స్టాకుల పట్టిక బోర్డు లను పరిశీలించడం కూడా జరిగింది. ఫర్టిలైజర్ యజమానాలతో డైలీ స్టాకు పట్టికను కంపల్సరీ అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందీ పెట్టకుండా యూరియా బస్తాల ఎరువులను,మందులను రైతులకు సకాలంలో ఉంచాలని, అదేవిధంగా ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులు,మందులు అమ్మాలని, ఎవరైన అధిక రేట్లకు విక్రయిస్తే రైతులను ఇబ్బందులూ పెడుతే ఫర్టిలైజర్ షాపుల యజమానుల పై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని వారు అన్నారు.

## పాత్రికేయులను పరామర్శించిన జువ్వాడి నర్సింగరావు



**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల సూర్య దినపత్రిక పాత్రికేయులు గోరువంతుల నారాయణ కు ఇన్ఫెక్షన్ కారణంగా కాలును తొలగించడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకున్న కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు సోమవారం కోరుట్ల పట్టణంలో విలీన గ్రామమైన ఎకిన్ పూర్ గ్రామంలో గల నారాయణ స్వగృహానికి వెళ్లి ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సీనియర్ పాత్రికేయులు అలీ నవాబ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్లి ఆయనను పరామర్శించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఇట్టి పరామర్శలు జువ్వాడి నర్సింగరావు తోపాటు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముక్కెర చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. నారాయణ కు ఇన్ఫెక్షన్ కారణంగా కాలును తొలగించడం జరిగింది ఇట్టి విషయం తెలుసుకున్న కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు సోమవారం కోరుట్ల పట్టణంలో విలీన గ్రామమైన ఎకిన్ పూర్ గ్రామంలో గల నారాయణ స్వగృహానికి వెళ్లి ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సీనియర్ పాత్రికేయులు అలీ నవాబ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్లి ఆయనను కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు పరామర్శించారు. ఇట్టి పరామర్శలు జువ్వాడి నర్సింగరావు తోపాటు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముక్కెర చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు



**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని ఐలాపూర్ యూసుఫ్ నగర్ గ్రామాలలో బాధిత కుటుంబాలను ఈరోజు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువాడి కృష్ణారావు ప్రమర్శించారు మండలంలోని ఐలాపూర్ కు చెందిన పోట్ట గంగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని మండలంలోని యూసుఫ్ నగర్ గ్రామంలో బత్తిని పెద్ద రమేష్ ఇటీవల గల్ఫ్ దేశంలో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు వెంట కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతంరాజాజం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెరుమాళ్ళ సత్యనారాయణ, మండల కాంగ్రెస్ బిసి సెల్ అధ్యక్షుడు ముక్కెర లింబాద్రి, గుగ్గిళ్ళ సురేష్ గౌడ్, శశిందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్ధంగా విద్యార్థులకు ఉప పరికరాల అందజేత



**చట్టం, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని నాగిరెడ్డిపేట మండలం బంజారా తాండా డీఎన్‌టీ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న నునుగొండ సత్యనారాయణమూర్తి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా టైలు, బెల్ట్‌లు, యూనిఫామ్లు పంపిణీ చేశారు. మొత్తం రూ.20,000 విలువైన సామాగ్రిని తన తల్లి నునుగొండ అన్నపూర్ణ, తండ్రి నునుగొండ వెంకటయ్య (రాష్ట్రపతి అవార్డు గ్రహీత) వాళ్ల జ్ఞాపకార్థంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరును నిలబెట్టేందుకు, ప్రతీ సంవత్సరం విద్యార్థులకు వీలైన సహాయాన్ని అందించాలనే తపనతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాను. విద్యార్థులు బాగా చదువుకొని మంచి పౌరులుగా ఎదగాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికే మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నాను అని చెప్పారు. ఈ ఉద్వేగభరిత కార్యక్రమంలో రిటైర్డ్ విఆర్ఓ ఆత్మకూర్ మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి, ఉపాధ్యాయులు రాజశేఖర్ చౌదరి, మోహన్ రెడ్డి, అబ్దుల్ రజాక్, అజీజుర్రహ్మాన్ (అప్సర ప్రింటింగ్ ప్రెస్), రామ్ చందర్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, అందరి నుండి అభినందనలు అందుకున్న ఈ కార్యక్రమం గ్రామస్థుల హృదయాలను తాకింది.

## కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**చట్టం బిచ్కుంద :** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మికాంతారావు ఆదేశానుసారంగా ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరంలో భాగంగా మున్సిపల్ అధికారులతో పాటు సోమవారం రోజు బిచ్కుంద మున్సిపల్ టౌన్ రేషన్ షాపుల యందు కొత్తరేషన్ కార్డులు లబ్ధిదారులకు బిచ్కుంద మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధర్పల్లి గంగాధర్ ఆధ్వర్యంలో రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుధర్పల్లి గంగాధర్ తో పాటు కామారెడ్డి జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు యోగేష్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయిని అశోక్, సీమ గంగారాం సార్ ,సురేష్ గౌండ, తుకారం ,నాగరాజ్ ఖలీల్ లింగురాం శంకర్ రవి చింతల హనుమాన్లు బసవరాజ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు .




## పాఠశాలకు బీరువా వితరణ



**చట్టం, లోకేశ్వరం :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పుష్పురు గ్రామంలో ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రముఖ వ్యాపార వేత్త బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ పాఠశాలకు అవసరమైన నిత్యవసర రికార్డులు భద్రపరచడానికి గతంలో ఉపాధ్యాయులు బీరువాను అడగగా తక్షణమే తమ సొంత నిధులతో నూతన బీరువాను ఉపాధ్యాయులకు అందించడం జరిగింది. దీనితో అభినందించిన ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థిని విద్యార్థులు గ్రామస్తులు ప్రత్యేకశాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పుష్పూర్ మాజీ సర్పంచ్ పుష్పూరు మాజీ సర్పంచ్ పోతన్న యోగేష్ తదితరులు ఉన్నారు.

## లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ



**చట్టం, కుంటాల :** నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలో రైతు వేదిక నందు నర్సాపూర్ G కుంటాల మండలాలకు సంబంధించిన నూతనంగా ప్రభుత్వం ద్వారా ఎంపిక అయిన లబ్ధిదారులకు ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానికి నరేంద్ర మోదీ కే దక్కుతుందన్నారు. నియోజక వర్గంలో అర్హులైన పేదవారికి ఆహార భద్రత కల్పించి, ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డుల వల్ల అనేక సంక్షేమ పథకాలను ప్రజలు పొందవచ్చని ఆసుపత్రి సేవలు, ఇళ్లులేని వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇలా అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు గ్రామస్తులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన నవనాథ సిద్ధుల గుట్ట పైన గల శివాలయంలో శ్రావణమాసం మొదటి సోమవారం రోజు ప్రత్యేక పూజలు నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆగిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం... కలెక్టర్ కు ఫిర్యాదు



**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మెట్ పల్లి మండలం బండలింగపూర్ గ్రామానికి చెందిన అల్గొట్ లక్ష్మి అనే మహిళ తన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ఆగిపోయిందంటూ జగిత్యాల జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.... అనేక సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక అద్దేకుంటూ జీవనం సాగిస్తున్నానని ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు పథకంలో ఇల్లు రావడంతో నాకున్న పాత స్థలం ఇంటి నెంబర్ 748 లో ఇంటి నిర్మాణం చేపడుతుండగా ఇదే గ్రామానికి చెందిన రెడ్డవేణి మహేష్ అనే వ్యక్తి అక్రమంగా భూమి నాదంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని అనేకమార్లు పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడినప్పటికీ తన ధోరణి మార్చుకోవడం లేదని అన్నారు. మహేష్ అక్రమంగా రెండంతస్తుల ఇంటి నిర్మాణం చేపట్టాడని దానికి ఎటువంటి పర్మిషన్లు తీసుకోలేదని గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు అక్రమ నిర్మాణం తొలగించాలని కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు లక్ష్మి తెలిపారు.

## దాతల సహకారంతో అభాగ్యులకు అన్నదానం



**చట్టం, లోకేశ్వరం :** బాసరకు చెందిన ఒక దాత ఆర్థిక సహాయంతో గడ్ చంద గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ ఆర్థిక సహాయంతో ఈరోజు నుంచి నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలో సోమవారం చుట్టుపక్కల అక్కడ అక్కడ గల యాచకులకు..నిరుపేదలకు దాదాపు 110 మందికి ఫుడ్ బ్యాంక్ భైంసా ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు యం.ఆంజనేయులు అన్నదానం చేసి ఆకలి తీర్చడం జరిగింది.ఈ అన్నదాన కార్యక్రమానికి సహాయం అందించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ.. ప్రతి ఒక్కరూ తమ తమ పుట్టిన రోజు సందర్భంగా..పెళ్లి రోజు సందర్భంగా వృదా కర్చు చేయకుండా నిరుపేదలకు ఆకలి తీర్చాలని మా అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మన్ యం ఆంజనేయులు ప్రత్యేక విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యం సుకుమార్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యోదయ స్కూల్ ఆధ్వర్యంలో టొబాకో & డ్రగ్స్ మహమ్మారి గూర్చి విద్యార్థులతో ర్యాలీ



**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మెట్ పల్లి పట్టణంలోని సూర్యోదయ హై స్కూల్ ఆధ్వర్యంలో డ్రగ్స్ మరియు టొబాకో మహమ్మారి అవగాహన గురించి విద్యార్థులతో బాబి ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్, టొబాకో వల్ల క్యాన్సరు కిడ్నీలు చెడిపోయి ప్రాణాంత కరమైన వ్యాధులు వస్తాయని కుటుంబాలు విచ్ఛిన్నమైతాయని వీలైనంత వరకు డ్రగ్స్ కు పొగాకు కు సంబంధించిన పదార్థాలను వాడ రాదని ప్రతి ఒక్కరూ క్యాన్సర్ లాంటి ప్రాణంతకమైన వ్యాధుల నుండి విలువైన జీవితాలను కాపాడుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యోదయ స్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గడువు చెల్లిన ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** సారంగాపూర్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఎరువులు, విత్తనాల దుకాణాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, రసీదు పుస్తకాలు తదితరాలను పరిశీలించారు. వానాకాలం సాగు సమయంలో రైతులకు ఎరువులు, విత్తనాల అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతుల అవసరాల మేరకు సరిపడే నిల్వలు ఉండేలా పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. రైతులను మోసం చేసే చర్యలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గడువు ముగిసిన, నాణ్యతలేని ఎరువులు లేదా విత్తనాలు విక్రయిస్తే సంబంధిత విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ తనిఖీలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, సంబంధిత అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# విహంగయానం.. ప్రమాదకర పయనం

దేశంలో ఎన్నో ప్రమాదాలు చూస్తున్నాం. పంచభూతాలలో ఒకటిగా ఉన్న నీటి ప్రయాణ ప్రమాదాలు, భూమిపై ప్రమాదాలు, గాల్లో ప్రయాణించే ప్రమాదాలు ఒక్కొక్కటిగా తరచూ జరుగుతూనే ఉన్నాయి. ప్రాణాలు నష్టపోతున్నాయి. కానీ ప్రమాదాల కట్టడికి పరిష్కార మార్గాలు మాత్రం కనిపించడం లేదు. అహ్మదాబాద్ విమాన ప్రమాదం ఇంకా మర్చిపోలేదు. దానిపై ప్రాథమిక నివేదిక మాత్రమే వచ్చింది. ఇంకా పూర్తి నివేదిక రావాల్సింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై పార్లమెంట్ లో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతూనే ఉంది. ఆ ప్రమాదానికి గల కారణాలేంటో ఇప్పటివరకు తేలలేదు. ఇంతలోనే బంగ్లాదేశ్ లోని ఢాకాలో విమానం కూలి 33 మంది చనిపోవడం తీవ్ర బాధాకరమైన అంశమే. ఒకదాని వెనుక ఒకటి విమాన ప్రమాదాలు జరగడం ఎయిర్ లైన్స్ నిర్వహణ తీరుపై ప్రశ్నార్థకమవుతోంది. అమాయకుల ప్రాణాలు గాల్లోనే ఉండిపోతున్నాయి. భూమిపై జరిగే ప్రమాదాలకు కనీసం డెడ్ బాడీలైన కండ్లతో చూసే అవకాశం ఉంటుంది.. గాలిలో జరిగే ప్రమాదానికి ఆ అదృష్టం కూడా దక్కకుండా పోవడం ప్రకృతి ప్రకోపమే. వరుస ప్రమాదాలకు కారణమైన విషయాలను దాచి పెట్టడం కూడా ఒకరకంగా ప్రమాదానికి కారణమని చెప్పొచ్చు. నిర్వహణ లోపం మానవ తప్పిదానని తప్పించుకునే ప్రయత్నంలో పరిష్కార మార్గాలకు అంతు పట్టడం లేదు. గాల్లో ప్రయాణాలకు భద్రత, భరోసా కరువే. ఒకప్పుడు గాలి మోటర్ ప్రయాణం అంటే ఎంతో ప్రాధాన్యత.



విమాన ప్రయాణం చేశామంటే జీవితంలో చెప్పుకోవడానికి ఒక స్థానం కల్పిస్తాం. విహంగంలో విహరిస్తూ తిరిగే ఒక ప్రయాణం, ఆహ్లాదకరమైన అనుభూతి చాలా వరకు చూసాము. ఇంకా చూడాలనుకునేవారు ఎంతోమంది ఉన్నారు. అయితే వరుస ఘటనలతో ఆ కాస్తాంత కోరికను కూడా విస్మరించుకోవలసిన పరిస్థితి. విమానం ప్రయాణం ఒక అదృష్టం అనుకుంటే.. గమ్యం చేరి భూమి మీదకు దిగడం మరో అదృష్టం అనుకోవాల్సిందే. ప్రస్తుతం విమాన ప్రయాణాలు చేస్తున్న వారికి భరోసా భద్రత విషయంలో భయపడాల్సిందే. విమానయాన సంస్థలు మెయింటెనెన్స్ లోపం, సరైన ప్రయాణ భద్రతను కల్పించడంలో విఫలమయ్యాయి అనే విమర్శలు ఇప్పటికే హోరెత్తుతున్నాయి. లాభాలు తప్పితే ప్రజల ప్రాణాలను పట్టించుకునే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం అవుతున్నాయి. వరుస జరుగుతున్న విమాన ప్రమాదాల ఘటనలతో గగన ప్రయాణం అంటే పనికి పోయే పరిస్థితి చూస్తున్నాం. ఈ ఏడాదిలోనే వరుస ప్రమాదాలు జరగడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి ఇంధనం కారణంగా చర్చ జరిగింది. అలాగే విమానాల నిర్వహణలో నాసిరక విధానాలను అనుసరిస్తున్నారని చర్చ జరుగుతోంది. ఖర్చులు తగ్గించాలనే కారణంతో విమాన నిర్వహణలో కొన్ని నాసిరకమైన భాగాలను వాడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. నాణ్యత లోపం వల్ల సాంకేతిక సమస్యలు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. విమాన సర్వీసుల్లో కనీస భద్రతా ప్రమాణాలు, పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించకుండానే తిరిగి వినియోగిస్తున్నారు అన్న ఆరోపణలు విమర్శలు వస్తునాయి. ఇదంతా ఎప్పుడో జరిగిన సంఘటనల నుంచి వచ్చిన ఫిర్యాదులు అయితే కాదు. నిర్వహణలోనే ప్రయాణికులు చెబుతున్న అంశాలను విమానయాన సంస్థలు పట్టించుకోకుండా... డబ్బులు ఆర్జించడమే లక్ష్యంగా పని చేస్తున్నాయి. ఒక ప్రమాదం జరిగినప్పుడు ఒక కారణం.. ఇంకో ప్రమాదం జరిగినప్పుడు మరొక కారణం.. ఇలా ఎన్ని చూసిన విమానయాన సంస్థలకు సంబంధించి నిర్వహణ లోపమే అని వాస్తవికంగా తెలుస్తోంది. విమానయాన రంగాన్ని నియంత్రించే కేంద్ర ప్రభుత్వ సంస్థ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) విమాన ప్రయాణ భద్రత విషయంలో పనిచేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శలు వస్తున్నా... దీనికి ఎలాంటి రిప్లై డిజిసిఏ నుంచి రాకపోవడం విమర్శలన్నీ వాస్తవమే అన్న దానికి బలం చేకూర్చినట్లే ఐతుంది. ఏదైనా సంఘటనలో జరిగినప్పుడు దర్యాప్తులు నివేదికలతో కాలం చెల్లిపోతుంది. ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (AAIB) ప్రమాదం జరిగినప్పుడు విచారణ చేయడమే తప్ప ఎలాంటి చర్యలు కనబడవు. ఇప్పటికైనా విమానయాన సంస్థలు ప్రమాణాలను అమలు చేయాలని, భద్రతపై పూర్తి పర్యవేక్షణ తరువాతే సర్వీసులకు అవకాశం కల్పించాలి. ఇంత సాంకేతిక టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న యుగంలో తప్పిదాలను పరిష్కరించుకోలేకపోవడం ప్రమాదానికి ముఖ్య కారణమని చెప్పుకోవాలి. (DGCA) ప్రమాదాల కట్టడి దిశగా మరింత ప్రయత్నాన్ని ముమ్మరం చేయాలి. భద్రత చర్యలు పాటించిన సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**పట్ట. హరి ప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్**
**8790843009**

## మహిమాన్వితం నాగుల పంచమి

శ్రావణ మాసం లో వచ్చే నాగుల పంచమి ఎంతో ప్రాధాన్యత సంతరించు కుంటుంది మంగళవారం రావడం శుభ ప్రదం అన్ని ఆలయాలలో నాగుల పంచమి భక్తి భావం తో జరుపుకుంటారు నాగేంద్ర స్వామి ఆలయాల్లో బాగా జరుపుతారు శివుని మెడలో ఆభరణంగా ఉండే నాగేంద్రుడిని పూజించడం హిందువుల ఆచారం. ఈ రోజున పాలు,పూలతో నాగదేవతను పూజిస్తారు. వెండి, రాగి, రాతి, చెక్క మొదలైన చేసిన నాగ పడిగెలకు భక్తులు ఆరాధిస్తుంటారు. సాక్షాత్తు పరమేశ్వరుడే "నాగపంచమి"నాడు భక్తులు ఆచరించాల్సిన విధులను పార్వతీ దేవికి వివరించినట్లుగా స్కాందపురాణం చెబుతోంది. పంచమి రోజున నాగప్రతిమకు పంచామృతము, జాజి, సంపెంగ, గన్నేరు వంటి పుష్పాలతో అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, పాయసము నివేదించాలని ముక్కంటి. పార్వతికి వివరించినట్లు ఆ పురాణం పేర్కొంటుంది.అందుచేత నాగపంచమి రోజున సూర్యోదయమునకు ముందే ఐదు గంటలకే లేవాలి. శుచిగా తలస్నానము చేసి, ఎరుపు రంగు బట్టలు ధరించాలి. పూజామందిరమును, ఇల్లును శుభ్రం చేసుకుని గడపకు పసుపు కుంకుమ, గుమ్మాన్ని తోరణాలతో అలంకరించుకోవాలి. పూజామందిరము, ఇంటిముందు ముగ్గులు పెట్టాలి.పూజ కొరకు గంధము, కుంకుమ, ఎరుపు వస్త్రము, నాగేంద్ర స్వామి, పాముపడగ, తెల్లని అక్షింతలు, ఎర్రటి పువ్వులు (కనకాంబరాలు), మందారమాలతో పాటు నైవేద్యం కోసం చలిమిడి, చిన్న చిన్న ఉండ్రాళ్లు, వడపప్పు, అరటిపండ్లను సిద్ధం చేసుకోవాలి. అంతేగాకుండా రెండు ఎర్రటి మట్టి ప్రమిదలను తీసుకుని దూదితో 7 వత్తులలో నేతితో దీపం వెలిగించాలి.నాగపంచమి రోజున ఉదయం 9 గంటల లోపు పూజను పూర్తి చేయాలి. పూజ చేసే సమయంలో నుదుట కుంకుమను ధరించి, పడమర దిక్కున తిరిగి పూజించాలి. "ఓం నాగరాజాయనమః" అనే మంత్రమును 108 మార్లు జపించి, పూజకు సిద్ధం చేసుకున్న నాగ ప్రతిమ లేదా నాగేంద్ర స్వామి చిత్రపటమునకు కర్పూర హారతులిచ్చి, నైవేద్యం సమర్పించుకోవాలి.కర్పూర హారతులిచ్చేందుకు ముందు నాగ అష్టోత్తరము, నాగ స్తోత్రము, నాగస్తుతి, నాగేంద్ర సహస్రనామములలో ఏదైనా ఒక దానితో నాగేంద్ర స్వామిని ప్రార్థించవచ్చు. ఇంకా నాగపంచమి రోజున ఇంటికి వచ్చే ముత్తైదువులకు నాగేంద్ర నిత్యపూజ, నాగదోషపరిహారము వంటి పుస్తకములను తాంబూలము, పసుపు, కుంకుమలతో కలిపి ఇస్తే పుణ్య ఫలం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. శ్రావణ శుక్ల పంచమి ఉదయమే తలస్నానము చేసి, ద్వారమునకిరువైపులా ఆవుపేడతో అలికి, పసుపు, బియ్యం పిండితో, ముగ్గులు వేసి, పసుపుతోకాని, ఆవుపేడతో కాని, బియ్యం పిండితో కాని నాగ చిత్రములు వేసి, ఆవుపాలు, వడపప్పు నైవేద్యము పెట్టవలెను. ఇలా చేసిన యింటిలోని వారు నాగదోషములు, అకాల మృత్యువు నుండి కాపాడబడి, పిల్లలకి, కళ్ళు, చెవులు, మూగ దోషములు పోవును. ఆయిల్లు పసిపాపలతో కళ కళ లాడుతుందును. చతుర్థి నాడు ఉపవాసము ఉండి, పంచమినాడు ఐదు తలల పాము చిత్రములువేసి అనంతాది నాగ రాజులను లాజలు, పంచామృతము, గన్నేరు, సంపెంగ, జాజి పూలతో పూజించి ఏమి తరగకుండా, వండకుండా ఉన్న సాత్విక ఆహారము, పెసలు, చిమ్మిరి, చలిమిడి, పాలు నైవేద్యము చేసి, అవి సేవించి, ఉపవాసము చేయవలెనని నియమము. ఆడువారు, పిల్లలు, కన్నెలు, పుట్ట వద్దకు వెళ్లి అలంకరించి, యగ్నోపవీతములు, వస్త్రములు సమర్పించి పాలు పోసి, పూజలు చేయుదురు. పిల్లలు లేనివారు పుట్టకి, రావి చెట్టు మొదలు ప్రతిష్ఠించబడిన ప్రతిమలకి ప్రదక్షిణములు చేయవలెను. ఆమట్టిని పొత్తి కడుపుకి రాసుకొందురు. కొన్ని ప్రదేశాలలో కొబ్బరి చిప్పలకి రంగులు వేసి దారాలు కట్టి త్రిప్పుట ఆచారము. దీనిని గురించి కొన్ని కథలు ఈ విధంగా బ్రాహ్మణులూ, ఋషులు, మునులు ... మానవజాతిని నమ్మించి సన్మార్గములో పయనించేటట్లు చేసారు ప్రతి ఒక్కరూ నాగ పంచమి రోజున ఆలయాలకు వెళ్లి సకల దేవతలను దర్శించు కుందాం



**అనుముల ప్రవీణ్ శర్మ పౌరోహితులు**
**వెంకటేశ్వర స్వామి ఆలయం గోపాల్ పూర్ హన్మకొండ 9440427943**
**జూలై 29 న నాగుల పంచమి సందర్భంగా**

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి



**చట్టం/హనుమకొండ:** పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కమ్యూనిటీ హాల్స్, గ్రామ పంచాయతీ భవనాలు, మహిళా కమ్యూనిటీ హాల్స్, అంగన్వాడి భవనాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతి, నూతన పనులపై ఆ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా మండలాల్లో కమ్యూనిటీ హాల్స్, గ్రామపంచాయతీ భవనాలు, మహిళా కమ్యూనిటీ హాల్స్, అంగన్వాడి భవనాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతి గురించి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఈఈ ఆత్మారాం, డీఈలు, ఏఈలు కలెక్టర్ కు వివరించారు. అభివృద్ధి పనుల స్థాయిలను, పనుల పర్యవేక్షణ, ఎప్పటి వరకు పూర్తి చేస్తారు, అభివృద్ధి పనుల విస్తీర్ణం, ఎంత శాతం పనులు పూర్తయ్యాయనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులలో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కొత్తగా చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో మిగిలిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి అన్నారు. ఈ సమావేశంలో డీఈలు శ్రీనివాసరావు, జయశంకర్, శిరీష, యుగంధర్, ఏఈలు పాల్గొన్నారు.

## ఉపాధితో యువత మరింత ముందుకెళ్లాలి



**చట్టం శివ్వంపేట :** ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదిరి చూడకుండా స్వయం ఉపాధితో యువత మరింత ముందుకెళ్లాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు, శివ్వంపేటకు చెందిన షేక్ అలీ దొంతి బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన హోటల్ ను మాజీ కో ఆప్షన్ మెంబర్ దావుద్ తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కార్వాన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ తమపై ఆధారపడి ఉన్న తన తల్లిదండ్రులతో పాటు తమ కుటుంబాల పోషణకు స్వయం ఉపాధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. స్వయం ఉపాధి పొందడమే కాకుండా నలుగురికి పని కల్పించొచ్చునని ఆయన అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మోహినుద్దీన్ ను షేక్ అలీ, ఆయన కుటుంబసభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ మెంబర్ దావుద్, మండల నాయకులు బజరంగి సేన అంజి, షేక్ మగ్దూం,సాబెర్,రమేష్, ఇమ్రాన్, అఫ్రోచ్, పారుఖ్, ఎండీ అబ్బు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల సభకు తరలిన నిజాంపేట వాసులు



**చట్టం రామాయంపేట :** నిజాంపేటమండల కేంద్రం నుండి సోమవారం మెదక్ లో జరిగే వికలాంగుల చేయూత పెన్షన్ దారుల సన్నాహక సదస్సుకు తరలి వెళ్లామని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు అమర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ దారుల సన్నాహక సదస్సుకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కొరకు అలాగే సభను విజయవంతం చేసేందుకు మండలం నుండి వికలాంగులు పెద్ద ఎత్తున తరలి వెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల మండల అధ్యక్షులు కోమ్మట రామస్వామి, ఎల్లం, సరవ్వ తదితరులు పాల్గొన్నారు.

## అమర్నాథ్ యాత్రికులకు 25 రోజులుగా అన్నప్రసాద వితరణ – రెండవ విడత సేవలు



**చట్టం, సిద్దిపేట ప్రతినిధి:** అమర్నాథ్ యాత్రికులకు గత 25 రోజులుగా అన్నప్రసాదాన్ని అందిస్తూ రెండవ విడత సేవలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాన్ని సిద్దిపేట అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించగా, ప్రతిరోజూ రుచికరమైన ఆహారాన్ని భక్తులకు అందించారు. ఈ సందర్భంగా సమితి ప్రధాన కార్యదర్శి గంజి రాములు, ఉపాధ్యక్షుడు అయిత రత్నాకర్ మాట్లాడుతూ, ఈ ఏడాది అమర్నాథ్ యాత్ర ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా సాగిందని తెలిపారు. అక్కడి ప్రభుత్వం చక్కటి నిర్వహణతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసిందని పేర్కొన్నారు. వారి అన్నదాన సేవల ద్వారా భక్తులు ఎంతో తృప్తి చెంది, హర్షం వ్యక్తం చేశారని వివరించారు. అనంతరం అధ్యక్షుడు కాచం కాశీనాథ్ మాట్లాడుతూ, అమర్నాథ్ యాత్రికులకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతమని, ఈ విధమైన సేవలకు పుణ్యఫలితాలు నిశ్చితంగా లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న గంజి రాములు, అయిత రత్నాకర్ సేవలను ప్రశంసిస్తూ, వారికి అభినందనలు తెలిపారు చైర్మన్ చీకోటి మధుసూదన్, కోశాధికారి గోపిశెట్టి శరభయ్య, పిఆర్ఓ డా. మాంకాల నవీన్ కుమార్. అనేకమంది ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో భద్రతా తనిఖీలు కట్టుదిట్టం



**చట్టం, భద్రాది కొత్తగూడెం ప్రతినిధి :** మావోయిస్టుల అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో భద్రాచలం పట్టణంలో పోలీసులు భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో బస్టాండ్ ప్రాంతంలో అనుమానితుల బ్యాగులను తనిఖీ చేయడం జరిగింది. ప్రజల రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. పట్టణంలోని ప్రతి వాహనాన్ని నిర్దిష్టంగా ఆపి తనిఖీ చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పోలీసు సిబ్బందితో పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరుతూ అపరిచితులను గమనించినచో వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.

## భైరవబావ్ మండపంలో ప్రత్యేక పూజలు



**చట్టం న్యూస్ బీర్కూర్ :** శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా కామారెడ్డి జిల్లా బీర్కూరు మండలం బైరాపూర్ గ్రామంలో భైరవ బావ మండపం వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు భజనలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com